కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

చౌటకూరు, మే 9, ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్ నామాల కిష్టయ్య పరిశీలించారు. మండల పరిధిలోని బద్రిగూడెం, ఉప్పరిగూడెంలలో డిసిఎంఎస్, ఐకెపిల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు మండలంలోని మరో 12 కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో పలు విషయాలపై చర్చించారు. కేంద్రాల్లో నీటి సమస్య, టార్పాలిన్స్, తూకం పరికరాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎండ తీవ్రతను బట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సెంటర్ ఇంచార్జి ఆంజనేయులు, వద్దే కిష్టయ్య, చింత బాల్‌రాజు, బైరు రాజు, జైపాల్, చింత మహేష్ తదితరులు ఉన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

ఘనంగా సేవాలాల్ 5వ వార్షికోత్సవ వేడుకలు

కొండాపూర్, మే 9, ప్రభాతవార్త:
కొండాపూర్ మండలం శివన్నగూడెం తండాలోని జగదాంబసేవాలాల్ ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు తండా ప్రజలు, యువకులు లంబాడ సంప్రదాయ వస్త్రధారణతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లంబాడ సంప్రదాయనృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా తండాలో నెలకొన్న పలుసమస్యలను స్థానికులు ఎమ్మెల్యేదృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే జగదాంబసేవాలాల్ ఆలయ అభివృద్ధికికూడా తనవంతు సహాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్, మండలపార్టీ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దేవేందర్, మల్లేశం, సర్పంచులు అర్జున్‌నాయక్, రాంచందర్, గ్రామశాఖ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్, వార్డుమెంబర్‌లు, యువకులు, మహిళలు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యసంరక్షణలో అంగన్‌వాడీల పాత్ర అమోఘం

-రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు అందచేస్తున్న దృశ్యం

అల్లాదుర్గం, మే 9, ప్రభాతవార్త:
చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణలో మహిళా, శిశు సంక్షేమశాఖ అందిస్తున్న సేవలు అమోఘమని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం అల్లాదుర్గం ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు అందచేశారు. అల్లాదుర్గం సబ్‌డివిజన్ పరిధిలోని టేక్మాల్, రేగోడు, పెద్దశంకరంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్ ఫోన్లు మంత్రి చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ సర్వేల్లో అంగన్‌వాడీ సిబ్బంది భాగస్వాములవుతూ కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందించటలో ప్రముఖపాత్ర పోషిస్తున్నారని అభినందించారు. అంగన్‌వాడీల సేవలు మరింత పారదర్శకంగా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకచర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే వారికి స్మార్ట్‌ఫోన్లు అందించటం జరుగుతుందని తెలిపారు. ప్రైవేటు భవనాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్లకు త్వరలో నిధులు మంజూరు చేయించి, స్వంత భవనాలు నిర్మాణం జరిగేలా చూస్తానని హామీఇచ్చారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అల్లాదుర్గం సబ్‌డివిజన్ పరిధిలో వివిధ కార్యాలయాలకు స్వంత భవనాలకోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఐసిడిఎస్, సిఐ, ఎస్‌టివో, ఫైర్‌స్టేషన్, గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాలకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. నెలలోపు ఐసిడిఎస్ కార్యాలయభవన నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తానని తెలిపారు. అనంతరం జహీరాబాద్ ఎంపి సురేష్‌షెట్కార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో అంగన్‌వాడీలు ఎంతో కృషిచేస్తున్నారని, ఆరోగ్యవంతమైన జీవతాన్ని అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని, పౌష్టికాహారాన్ని అందించటంలో అంగన్‌వాడీల పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో రమాదేవి, శిశుసంక్షేమశాఖ పిడి హేమభార్గవి, సిడిపివో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం, సాయిబాబ, బాల్‌రాజ్, బాలకిషన్, శ్రీనివాస్, సర్పంచులు సౌమ్యగౌడ్, శంకర్, వీరప్ప, సదానందం, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరితో కల్లాల్లోనే నిలిచిపోయిన యాసంగి ధాన్యం

-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా

నర్సాపూర్, మే 9, ప్రభాతవార్త:
రైతులు యాసంగి సీజన్లో పండించిన పంటనంతా ప్రభుత్వం బాయిల్డ్ రైస్‌తో తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా అన్నారు. శనివారం నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వైఖరి వల్ల తెలంగాణలో యాసంగి సీజన్‌లో పండించిన పంటనంతా ప్రభుత్వం రా రైస్ ద్వారా కొనుగోలు చేస్తామనడంతో ఈ ధాన్యమంతా కల్లాల్లోనే నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం యాసంగిలో పండించిన ధాన్యమంతా రా రైస్‌తోనే తీసుకుంటామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఏ రైస్‌మిల్ వ్యాపారి కూడా ముందుకు రావడం లేదన్నారు. యాసంగి సీజన్లో పండించిన పంట అంతా నూకలుగా మారిపోయి నష్టం కలుగుతుందని పేర్కొంటూ యాసంగి ధాన్యం కేంద్రప్రభుత్వం బాయిల్డ్ రైస్ ద్వారానే తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. పండించిన ధాన్యాన్ని ఎవరూ తీసుకోకపోవడంతో రైతులు ఎంతగానో నష్టపోయే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా బాయిల్డ్ రైస్‌కు 15 బ్రోకన్స్, రా రైస్‌కు 25 బ్రోకన్స్ తీసుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వ వైఖరి వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని పేర్కొంటూ వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి యాసంగి ధాన్యాన్ని తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు, రైతులు చరమగీతం పాడి నామ రూపాలు లేకుండా చేస్తారని పైడి శ్రీధర్‌గుప్తా హెచ్చరించారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే నాపై 34 కేసులు

-నేనే తప్పు చేయలేదు-ప్రజలకు ప్రమాణం చేసి చెబుతున్నా

-సెంట్రల్ జైలు నుంచి విడుదలైన మన్నె క్రిశాంక్

కంది, మే 9, ప్రభాతవార్త:
ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే నాపై 34 కేసులు పెట్టారని, నేనే తప్పు చేయలేదని, రాష్ట్ర ప్రజలకు ప్రమాణం చేసి చెబుతున్నా అంటూ బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ అన్నారు. శనివారం కంది సెంట్రల్ జైలు నుంచి క్రిశాంక్ విడుదలయ్యారు. 16 రోజులుగా ఆయా కేసుల్లో శిక్షను అనుభవిస్తూ కంది సెంట్రల్ జైల్లో ఉన్న క్రిశాంక్ విడుదలైన సందర్భంగా మీడియాతో క్రిశాంక్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కావాలనే తనపై 34 కేసులు పెట్టేలా చేశారని మండిపడ్డారు. నన్ను నేరస్థుడిగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాపై ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నించడమే మా హక్కన్నారు. అంగన్‌వాడీలకు అందించే ఫోన్‌లలో అవినీతి జరిగిందని, సిబిఐ విచారణ కోరానని, యూనివర్సిటీలో చెట్లను నరకడాన్ని ప్రశ్నించినందుకు, ప్రజాసమస్యలపై ప్రశ్నించినందుకే నాపై కేసులు పెట్టారన్నారు. వైఫై పాస్‌వర్డ్ ఈ-మెయిల్, నా ఫోన్ పాస్‌వర్డ్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక నేరాలు జరుగుతున్నాయన్నారు. పోలీసులు ప్రజలను రక్షించేందుకే కాని, ప్రతిపక్షాలను శిక్షించేందుకు కాదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయ పార్టీగా దిగజారిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు విజన్ లేదని, నేను ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమాలు చేశానని, అందుకే ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటానని క్రిశాంక్ అన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

-బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవ్‌రావు పాటిల్

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

సిర్గాపూర్, మే 9, ప్రభాతవార్త:
మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు 9వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారని, జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్‌రావు పాటిల్ డిమాండ్ చేశారు. శనివారం బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి సంజీవ్‌రావు పాటిల్ మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మండలంలో రైతుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచన రాకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తనజీపటేల్, బాబునాయక్, హసీమ్ శేరికర్, రమేష్, మైను, చాకలి శంకర, శివారెడ్డి, నబీసాబ్ తదితరులు ఉన్నారు.

నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

-నిమ్జ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

జహీరాబాద్, మే 9, ప్రభాతవార్త:
జహీరాబాద్ ఇండస్ట్రియల్‌స్మార్ట్‌సిటీ(నిమ్జ్) పరిధిలో చేపడుతున్న అభివృద్ధిపనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధంచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెంట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. మౌలికవసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యంలేకుండా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టిజిఐఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డితో కలిసి జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్, పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుతస్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూములచుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టిజిఐఐసి, నిమ్జ్, రెవెన్యూ, సంబంధితశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటి వరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టూ పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిజిఐఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి, జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్‌శాఖ అధికారులు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

కాళేశ్వరాన్ని కించపరిస్తే ముక్తేశ్వరుడి శిక్ష తప్పదు

-మేడిగడ్డ మరమ్మతులు చేతగాక, తమ్మిడిహట్టి వద్ద జలహారతుల డ్రామాలు

-సిఎం రాజకీయాలకోసం తప్ప, రాష్ట్రప్రయోజాల కోసం పనిచేయడంలేదు

-బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్, మాజీమంత్రి హరీశ్‌రావు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 9, ప్రభాతవార్త ప్రతినిధి:
మహారాష్ట్ర, ఉమ్మడిఆంధ్రప్రదేశ్, ఢిల్లీలో మూడు చోట్ల కాంగ్రెస్ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడే తమ్మిడిహట్టికోసం మహారాష్ట్రను ఒప్పించలేకపోయారు. సర్వ అధికారాలు ఉన్నప్పుడే ఏంచేయలేకపోయారు. ఇప్పుడు చేస్తామంటే ఎలా నమ్ముతారని బిఆర్ఎస్ డిప్యూటీఫ్లోర్‌లీడర్ మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాయలంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ్మిడిహట్టి వద్ద తట్టెడు మట్టికూడా ఎత్తకుండా సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.2300కోట్లు స్వాహాచేసిన కాంగ్రెస్‌నేతలు అవినీతిపై మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని, బిఆర్ఎస్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగాఖండించారు. ఆదిలాబాద్‌జిల్లా తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రులు చేసిన హడావిడి చూస్తే పని తక్కువ, ప్రచారం ఎక్కువగా ఉందని, సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులకు వాగుడు తప్ప, చేతలు శూన్యమన్నారు. తమ్మిడిహట్టి వద్ద 150మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పందంజరిగిందని మంత్రి వివేక్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంత్రిహోదాలో ఉండి ప్రజలు ఏమనుకుంటారన్న సోయిలేకుండా పచ్చి అబద్ధం మాట్లాడడంసరికాదన్నారు. తమ్మిడిహట్టివద్ద 150మీటర్ల ఎత్తుకు ఒప్పందం ఉంటే ఉమ్మడిరాష్ట్రంలో ఏడున్నరేళ్ల అధికారంలో ఉండికూడా తట్టెడుమట్టి ఎందుకు తవ్వలేదన్నారు. అనాడు మహారాష్ట్ర సిఎం పృథ్వీరాజ్, అప్పటి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారని, మాతో ఒప్పందం లేకుండా ఏకపక్షంగా పనులుచేస్తున్నారు. ఇవన్నీ నిర్వీర్యం అవుతాయని, మీరు ఏ పనిచేసినా అది వృథా అవుతుందని స్పష్టంగాచెప్పారని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు అగ్రిమెంట్ అయిపోయిందని పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని తెలిపారు. కనీస అవగాహన లేకుండా కాంగ్రెస్‌మంత్రులు మాట్లాడుతున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్‌కట్టి సుందిళ్ల బ్యారేజ్‌కి నీళ్ల తెస్తాం అంటారు. సిఎం రేవంత్‌రెడ్డి ఏమో తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి లిఫ్టుతో నీళ్ల తెస్తామంటారు. మంత్రి జూపల్లి లిఫ్టు అవసరం లేదు. గ్రావిటీద్వారా వస్తాయని అజ్ఞానపుమాటలతో రాష్ట్రపరువు తీస్తున్నారని మండిపడ్డారు. తమ్మిడిహట్టి దగ్గర నీళ్ల లేవని..ప్రత్యామ్నాయం చూసుకోవాలని కేంద్ర జలవనరులశాఖలోని అన్ని విభాగాలు చెప్పాయని వివరించారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు ఒక్కో పార్టీలో ఒక్కో మాట మాట్లాడడం సిఎం నైజం అన్నారు.

మేడిగడ్డ వద్ద 6400 క్యూసెక్కుల నీరు కిందికి పోతుంది...

ఈ మండుటెండల్లో నిమిషానికి మేడిగడ్డ వద్ద 6400 క్యూసెక్కుల నీళ్ల కిందికి వెళ్లిపోతున్నాయని హరీష్‌రావు తెలిపారు. తమ్మిడిహట్టి వద్ద కేవలం 2వేల క్యూసెక్కులు మాత్రమే పోతున్నాయని.. 2వేలు ఎక్కడ.. 6400 క్యూసెక్కులు ఎక్కడని ప్రశ్నించారు. మేడిగడ్డవద్ద మూడు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే కెసిఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందో అన్న అక్కసుతోనే పనులుచేయడం లేదన్నారు. వచ్చే యేడాది ఎల్‌నినో వల్ల దేశమంతా కరువువస్తుందని సైంటిస్టులు చెబుతున్నారని, కటికచీకట్లో కారుదీపం లాంటిది కాళేశ్వరంప్రాజెక్టు అని, ఎంత కరువొచ్చినా నదిలో నీళ్ల ప్రవహించే స్థలం మేడిగడ్డ అని అన్నారు. కాళేశ్వరాన్ని తక్కువ చేసి మాట్లాడితే అది కెసిఆర్‌ను తక్కువ చేసినట్లు కాదని, తెలంగాణరాష్ట్రానికి, తెలంగాణజాతికి చేస్తున్న ద్రోహమన్నారు. కాళేశ్వరాన్ని కించపరిస్తే అందులో కొలువైన ముక్తేశ్వరుడు కచ్చితంగా శిక్షవేస్తాడని, తస్మాత్‌జాగ్రత్త అని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ ఇకనైనా తమ్మిడిహట్టి జలహారతుల డ్రామాలు కట్టిపెట్టి వెంటనే మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేసి రాష్ట్ర రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలకోసం పనిచేస్తున్నారుతప్ప రాష్ట్రప్రయోజాల కోసం పనిచేయడం లేదన్నారు. సిఎంతోపాటు మంత్రులు తల,తోకలేకుండా మతిలేని, సోయిలేని, అవగాహనలేని పరిజ్ఞానంతో వ్యాఖ్యలుచేస్తూ రాష్ట్రపరువు మంటగలుపుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ నాయకులు రాధాకృష్ణశర్మ, కాముని శ్రీనివాస్ మాణిక్యరెడ్డి, రాజనర్సు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, మే 9, ప్రభాతవార్త:
మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వలక్ష్యం అని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చీలపల్లి గ్రామంలో నూతన మత్స్య సహకార సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ మత్స్య సహకార సంఘం వలన గ్రామంలోని యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈసంఘం ద్వారా మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు సులభంగా అందుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా చేపల పెంపకం, మార్కెటింగ్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలలో మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. మత్స్య సహకార సంఘాల ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతమవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత్స సహకార సంఘం సభ్యులకు ధృవపత్రాలను అందించారు. అనంతరం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మత్స్య సహకార సంఘం సభ్యులకు ధృవపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభుదాస్, నాయకులు రాయిని మధుసూదన్, నారా గౌడ్, మురళిపంతులు, రాజేందర్‌గౌడ్, సుభాష్, కుంట్ల రాములు, ప్రశాంత్‌రెడ్డి, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు పెరుమాల్‌గౌడ్, సిఈవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఫోటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్

-హుస్నాబాద్ విద్యుత్ కార్యాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు

హుస్నాబాద్ రూరల్, మే 9, ప్రభాతవార్త:
హుస్నాబాద్ విద్యుత్ డివిజన్ ఇంజినీరింగ్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహేష్ వ్యవహారం కలకలం రేపుతోంది. మహిళా ఉద్యోగినులు, ఇతర మహిళల ఫోటోలను మార్ఫింగ్ చేసి వారిని మానసికంగా వేధింపులకు గురిచేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో కార్యాలయ వర్గాల్లో కలకలం రేగింది. సమాచారం ప్రకారం మహేష్ కొంతకాలంగా మహిళల వ్యక్తిగత ఫోటోలను సేకరించి వాటిని మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా మార్చి భద్రపరిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని రోజులుగా అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న మహేష్ బాధిత మహిళలకు ఫోన్లు చేసి లేదా మెసేజ్‌ల ద్వారా బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈవ్యవహారాన్ని గమనించిన మహిళా ఉద్యోగినులు తీవ్ర ఆందోళనకుగురై పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. మహేష్ మొబైల్ ఫోన్, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు తెలుస్తోంది. మహిళల ఫోటోలను మార్ఫింగ్ చేసి తన వద్ద భద్రపరిచాడా? వాటిని ఇతరులకు పంపించాడా? సోషల్ మీడియాద్వారా వ్యాప్తిచేశాడా? అనేకోణాల్లో పోలీసులు సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారగా, మహిళా ఉద్యోగినులు భయాందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో మరికొందరు బాధితులు ఉండే అవకాశాన్ని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

ఈవిషయంపై ప్రభాతవార్త ఎస్ఐ లక్ష్మారెడ్డి వివవణ కోరగా, ఈవిషయంలో తమకు ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమేనని, నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, మహిళల గోప్యతకు భంగం కలిగించే వారు ఎంతటివారైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం

పుల్‌కల్, మే 9, ప్రభాతవార్త:
కట్టుకున్నభార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన పుల్‌కల్ గ్రామానికి చెందిన పోచన్నగారి సామేల్‌కు అందోలు మండలం ఎర్రారంగ్రామానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సామేల్ తాగుడుకు అలవాటుపడి భార్యను తరుచూ చిత్రహింసలకు గురి చేస్తుండటంతో భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి భార్యను కాపురానికి తీసుకుపోయినా, భర్తలో మార్పు లేకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రావడం లేదంటూ శనివారం తన ఆటో(టిఎస్15యుడి0904)ను తీసుకుని ఎర్రారం వెళ్లి అత్తగారింట్లో గొడవ పడగా భార్య కాపురానికి ససేమిరా రానని తేల్చి చెప్పడంతో సామేల్ జీవితంపై విరక్తిచెంది విష గుళికలు మింగి ఆటోను తోలుకుంటూ మండల కేంద్రమైన చౌటకూరు వద్ద 161వ జాతీయ రహదారి సర్వీసురోడ్డుపై ఆరబెట్టిన వరి కుప్పలకు ఆటో ఢీకొనగా, సామేల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో ఉన్న సామేల్ నోట్లో నుంచి నురుగులు వస్తుండంతో విషయంతెలుసుకున్న ఎన్‌హెచ్ఎఐ అంబులెన్స్‌సిబ్బంది సామేల్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోరాట పటిమను నిర్బంధాలతో ఆపలేరు

-రసమయి ఇంటి నిర్బంధం

మాజీ ఎమ్మెల్యే రసమయిని హౌస్ అరెస్టు చేసిన దృశ్యం

బెజ్జంకి, మే 9, ప్రభాతవార్త:
మండల పరిధిలోని గుండారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను శనివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కరీంనగర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కార్యాలయంపై, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కారుపై జరిగిన దాడిని ఖండిస్తూ కరీంనగర్ బంద్‌కు పిలుపునివ్వడంతో రసమయి బాలకిషన్‌ను ముందస్తుగా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలను, మాజీ ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను ఇంట్లో నిర్బంధించడం అప్రజాస్వామికం అని అన్నారు. ఇది కాంగ్రెస్, బిజెపి కలిసి ఆడుతున్న ఒక రాజకీయ నాటకం అని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో వచ్చిన గొప్ప మార్పు ఇదేనా అంటూ ప్రశ్నించారు.

11న బిసిటిఎ ప్రతిభా పురస్కారాల ప్రదానం

చాంద్రాయణగుట్ట, మే 9, ప్రభాతవార్త : బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బిసిటిఎ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ సోమవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రతిభా పురస్కారాలు -2026 ప్రదానం చేయనున్నట్లు ఆ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బియ్యం సంతోష్ కుమార్, లక్ష్మీకాంతరావులు ఒక ప్రకటనలో తెలిపారు. రవీంద్రభారతిలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైయ్యే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, నాగర్కర్నూల్ ఎంపి మల్లు రవి, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తదితర ప్రముఖులు హాజరైతారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు గౌరవ పురస్కారం, ఉత్తమ విద్యా ప్రమాణాలు పాటించి ప్రధానోపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాని మోడీ పర్యటనను బిసిలు బహిష్కరించాలి



ప్రభుత్వ సలహాదారు హనుమంతరావుకు సంఘీభావం తెలుపుతున్న వెంకటేష్

చాంద్రాయణగుట్ట, మే 9, ప్రభాతవార్త : ప్రధాన మంత్రి నరేంద్ర మోడి తెలంగాణ పర్యటనను బీసీలు కలిసికట్టుగా బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇంచార్జి కె.వెంకటేష్ కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మొదలు పెడుతున్న జనగణలో బీసీల కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు శనివారం అంబర్పేట్లోని తన నివాసం వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు పాతబస్తీ నేతలు మద్దతు పలికారు. సీనియర్ నేత వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లి హనుమంతరావుకు పార్టీ కండువా కప్పి పూలమాలతో సన్మానించారు. తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో సమగ్ర కులగణన చేస్తామన్న మోదీ మాటలు ఏమైయ్యాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని కులాలు ఆధిపత్యం చేస్తూ బీసీలను అణచివేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని బిసిలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు రాష్ట్రాల ఫలితాలు పునరావృతం అవుతాయి

-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి

బాగ్ లింగంపల్లి మోడీ సభ విజయవంతం కోసం ప్రచారాన్ని నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) :
పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయోత్సాహం తెలంగాణలోనూ కొనసాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. శనివారం బాగ్ లింగంపల్లి లో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో నిర్వహించనున్న మోడీ భారీ బహిరంగ సభకు సంబంధించిన వాల్ రైటింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాగ్ లింగంపల్లి డివిజన్ లోని చిక్కడపల్లి, బాగ్ లింగంపల్లి, అచ్చయ్యనగర్, పద్మా కాలనీ, సంజయ్ నగర్ తదితర ప్రాంతాలలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.మోడీ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపారులు, భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు జక్కా శ్రీను, జైపాల్ రెడ్డి, బీరయ్య, నరసింహ, రాజు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువుటద్దం దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులు

దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి మే 9 ప్రభాతవార్త : నిస్వార్థ సేవే లక్ష్యంగా, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న సేవామూర్తి దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులు అని వక్తలు ప్రశంసించారు. శనివారం ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ , విజయ్ క్రియేషన్స్ అధినేతలు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పేరి నాగేశ్వరరావు, పేరి విజయ లక్ష్మి , సిండికేట్ బ్యాంక్ మాజీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పేరి కామేశ్వర రావు మాట్లాడుతూ సేవ అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అవసరమైన సమయంలో తోడుగా నిలబడటమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. సమాజంలో ధనవంతులు ఎందరో ఉన్నా, పరుల కష్టాన్ని తన కష్టంగా భావించే వారు అరుదుగా ఉంటారని, ముఖ్యంగా ఎవరైనా మరణించినప్పుడు ఆ కుటుంబానికి మానసిక ధైర్యాన్ని ఇస్తూ, అంత్యక్రియల ఏర్పాట్లలో స్వచ్ఛందంగా పాల్గొని సుబ్రహ్మణ్యం అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. ఆయన సేవలో భాగస్వామిగా నిలుస్తున్న ఆయన సతీమణి ని కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు, కళాకారులు పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు.

ప్రజలందరూ స్వచ్ఛందంగా స్వీయగణన చేసుకోవాలి

- జడ్సి హేమంత్ సహదేవరావు

నార్సింగి సర్కిల్ కోకాపేట్ వద్ద స్వీయ గణన వాకథన్ను ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావ్.

నార్సింగి, మే 9 ప్రభాతవార్త : ప్రజలందరూ స్వచ్ఛందంగా స్వీయ గణనను చేసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బి.హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. శనివారం నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేట్ వద్ద స్వీయ గణనపై ఏర్పాటు చేసిన మారథన్ను జడ్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ గణనపై ప్రజలలో ఉన్న అపోహలు తొలగించి, అవగాహన కల్పించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు మీ కుటుంబ సభ్యుల వివరాలను మీ మొబైల్స్/కంప్యూటర్ల ద్వారా పోర్టల్లో రాష్ట్రంను ఎంచుకొని 33.ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సూచించారు. మీ వివరాలను మీరే పూర్తి చేసుకుంటే సమయం ఆదా అవుతుందని, లేదంటే అధికారులు మీ ఇళ్లకు వచ్చి పూర్తి వివరాలు తీసుకుంటారని తెలిపారు. స్వీయ గణన ఈ నెల 10.వ,తేదీతో ముగుస్తుందని గుర్తు చేశారు. మీ వివరాలు పూర్తి గోప్యంగా ఉంచబడుతాయని జడ్సి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి డిసి కృష్ణ మోహన్రెడ్డి, పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థిగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనే విలువలు నేర్చుకున్నా

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమల దేవి

అత్తాపూర్ మే9,ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల 80 వ కాలేజీ డే ఉత్సవాలు రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ తిరుమలాదేవి ఈద ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. తాను 40 ఏళ్ల క్రితం కమ్యూనిటీ సైన్స్ బీ ఎస్ సీ, ఎం ఎస్ సీ కోర్సు లు ఈ విశ్వవిద్యాలయం లోనే చదివానన్నారు. క్రమశిక్షణ, విలువలు ఈ సంస్థ నుంచే నేర్చుకున్నానని.. తాను ఇప్పుడు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ఈ విశ్వవిద్యాలయం లో నేర్చుకున్న మంచి అంశాలే తనను నడిపిస్తున్నాయని తిరుమలా దేవి వివరించారు. పౌష్టికాహారం, వంటలు, టెక్స్ టైల్స్ వంటి కీలక సబ్జెక్ట్ లు తాము ఆనాడు హోమ్ సైన్స్ కోర్సు లో చదివామని వివరించారు. నేడు ప్రతి ఒక్కరూ శారీరక సౌష్టవం గురించి మాట్లాడుతున్న తరుణాన ఆ కోర్సు ఎంత ఉపయుక్తం గా ఉంటుందో ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విశ్వ విద్యాలయం లో వృద్ధులకి వెల్ నెస్ సెంటర్ ప్రారంభించడం వంటి అనేక మంచి కార్యక్రమాలు చేపట్టినందుకు ఉప కులపతి అల్దాస్ జానయ్య ని జస్టిస్ తిరుమలాదేవి అభినందించారు. మొబైల్ కారణంగా ప్రపంచమే మనిషి చేతిలో ఉంటున్న ఈ కాలం లో మానవత్వం, క్రమ శిక్షణ లు కలిగి సమాజం లో మంచి మనుషులు గా గుర్తింపు పొందాలని జస్టిస్ తిరుమలాదేవి విద్యార్థుల కి సూచించారు. ముగ్గురు ప్రధాన మంత్రులు, ఒక ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం అయిన ఈ విశ్వవిద్యాలయం అనేక రంగాలకి ఎందరో ప్రముఖులని ఆందించిందని అల్దాస్ జానయ్య అన్నారు. ఈ విశ్వ విద్యాలయం విద్యార్థినైన తాను ఉపకులపతి బాధ్యత లు చేపట్టిన తర్వాత విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. వాటిలో కొన్ని కఠినం గా అనిపించినా విద్యార్థుల బాగు కోసమే ఆ నిర్ణయాలు తీసుకున్నామని, విద్యార్థులు అది అర్థం చేసుకోవాలని విశ్వ విద్యాలయాలు విజ్ఞాన, పరివర్తన, సంస్కరణ కేంద్రాలని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల పైననే ఉందని అభిప్రాయపడ్డారు.కార్యక్రమం లో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి కళాశాల ప్రగతి నివేదిక ని సమర్పించారు.బీ ఎస్ సీ పూర్తి చేసిన కొందరు విద్యార్థులు తమ కళాశాల అనుభవాలని వివరించారు.ఈ సందర్భంగా కాలేజీ మ్యాగజైన్ సీడీని అతిథులు విడుదల చేశారు.వివిధ పోటీలలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకి బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో రిజిస్ట్రార్ డాక్టర్ బి. ని. దిబీ. విద్యాసాగర్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీరాణి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సి. హెచ్. వేణుగోపాల రెడ్డి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ కె. బి. ఈశ్వరి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి,కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇంచార్జి డాక్టర్ వి. రామ్ రెడ్డి, బోధన, బోధనేతరసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి : మాజీ ఎంపి టీజీ వెంకటేష్

కౌటికే విఠల్ ను నియామకపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీ

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా ప్రముఖ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారు, ప్రముఖ సామాజిక సేవకులు కౌటికే విఠల్ నియమితుల య్యారు. శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో సంస్థ గ్లోబల్ చైర్మన్, మాజీ ఎంపీ టీ. జీ. వెంక టేష్ ముఖ్య అతిథిగా హాజరై కౌటికే విఠల్ కు నియామక పత్రాన్ని అందజేసిసత్కరించి, మాట్లాడారు. కౌటికే విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా భారతదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహా దారులలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తమ పాలసీదారుల జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం వెయ్యి మందికి ఉచిత అన్న దానం నిర్వహిం చడం, చలికాలం లో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం, ఎండాకా లంలో వేలాది మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశేషగుర్తింపు పొందారని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన న్యాయవాది మడుపల్లి రవిగుప్త మాట్లా డుతూ కౌటికే విఠల్ పట్టుదల, కార్యద క్షతకు ప్రతీక అని అన్నారు. ఏ బాధ్యత చేపట్టినా సం పూర్ణ నిబద్ధతతో నిర్వహి స్తారని కొనియాడారు. అనంతరం కౌటికే విఠల్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్య వైశ్య మహాసభలో ఆరు సంవత్సరాలు పూర్తయ్యాయని, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జాతీయ సలహాదా రుగా సేవలందించిన విషయా న్ని గుర్తు చేశారు. జాతీయ సలహాదారుగా దేశవ్యాప్తంగా నిర్వ హించిన సేవా కార్య క్రమాల గురించి క్లుప్తంగా వివరించారు. భారతీయ జీవిత బీమా సంస్థ సీనియర్ మోస్ట్ ఏజెంట్, ఏజెంట్ల నాయకుడు బి.ఎన్. చారి మాట్లాడుతూ.. కౌటికే విఠల్ ప్రతిరోజూ కొత్త రికా ర్డులు సృష్టిస్తూ ప్రతి సంవ త్సరం నంబర్ వన్ స్థానాన్ని నిలబె ట్టుకుంటున్నారని అభినందించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరికీ కౌటికే విఠలను సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

చెరువుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం

- నీటి పారుదల శాఖ ఎస్.ఇ శ్రీనివాస్

వట్టినాగులపల్లిలో ఏర్పాటు చేసిన రైతు వారము కార్యక్రమంలో పాల్గొన్న నీటి పారుదల శాఖ అధికారులు, రైతుల దృశ్యం.

నార్సింగి, మే 9 ప్రభాతవార్త : గండిపేట మండలంలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని నీటి పారుదల శాఖ ఎస్.ఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వట్టినాగులపల్లిలోని వార్డు కార్యాలయం వద్ద రైతు వారము కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్.ఇ శ్రీనివాస్ మాట్లాడుతూ గొలుసు కట్టు చెరువులను పరిరక్షించుకునేందుకు, చెరువుల్లోకి వరద నీరు మోసుకు వచ్చే కాలువలను కబ్జాల చెర నుంచి విడిపిస్తామని స్పష్టం చేశారు. చెరువుల భూమిలో, బఫర్ జోన్లో ఎక్కడా కూడా నిర్మాణాలు చేపట్టకూడదని, కేవలం పంటలు పండించుకోవాలని సూచించారు. చెరువుల భూములు, వరద కాలువల భూములు కబ్జాలకు గురైతే వెంటనే మా నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకు రావాలని రైతులకు, ప్రజలకు సూచించారు. చెరువులను కాపాడుకుంటే భూగర్భ నీటి మట్టం పెరుగుతుందని, ప్రజలకు అవసరమైన నీరు అందుతుందన్నారు. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు భూమిలో ఇంకడం లేదని, కాంక్రీట్ జంగల్గా గ్రామాల్నీ మారడం వలన నీరంత దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుందన్నారు. వట్టినాగులపల్లిలోని గౌని చెరువు, ఎర్రకుంట, తూముకుంట, కొత్త చెరువుల వద్దకు అధికారులు వెళ్లి పరిశీలించారు. ఈ చెరువుల్లోకి వరద నీటిని తెచ్చే కాలువలను సైతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు సురేష్ బాబు, రమ, నరేందర్, లక్ష్మారెడ్డి, రైతులు ముత్యంరెడ్డి, చుక్కయ్య, రాఘవరెడ్డి, తారాసింగ్, బాల్రాజ్, వెంకటేష్, దర్శన్, శేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత విభావరికి ముగ్ధులైన కళాప్రియులు

-ఆరభి సంస్థ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

మాదాపూర్, మే 9 (ప్రభాత వార్త): సంగీతానికి ఎల్లలు లేవని, అది సుమధురం, రసవత్తరం, మహత్తరమని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం హైదరాబాద్లోని శిల్పకళ వేదికలో జరిగిన ఆరభి ది సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ 28వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.నాద పరంపర పేరుతో నిర్వహించిన ఈ విశిష్ట కార్యక్రమంలో 150 మంది వయోలిన్ కళాకారులు పాల్గొని గ్రాండ్ వయోలిన్ సింఫనీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కళారత్న డాక్టర్ అశోక్ గుర్జాలే సంగీత దర్శకత్వంలో గంటన్నర పాటు సాగిన ఈ సంగీత మహోత్సవం కళాప్రియులకు అపూర్వ అనుభూతిని కలిగించింది.జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ చిన్నారుల నుంచి సీనియర్ కళాకారుల వరకు అందరూ కలిసి అందించిన ఈ సంగీత కచేరి భారతీయ సంగీత వారసత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కీర్తనలు వింటూ తాను భావోద్వేగానికి గురయ్యానని, తెలియకుండానే ఆనందభాష్పాలు వచ్చాయని పేర్కొన్నారు.భారతీయ సంగీతం ఒక తపస్సు అని, సంగీత సాధనలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. అన్నమయ్య, త్యాగయ్య, కట్ట బొమ్మన, ఝాన్సీరాణి లాంటి మహనీయుల గురించి మన చరిత్ర పాఠాల్లో తక్కువగా ఉందని, దేశాన్ని దోచిన అలెగ్జాండర్, రాబర్ట్ క్లైవ్ గురించి ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఆరభి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అశోక్ గుర్జాలే ఐదు దశాబ్దాలుగా అందిస్తున్న సంగీత సేవలను కొనియాడారు. ప్రముఖ మృదంగ విద్వాంసులు పాలకుర్తి రామచంద్ర శర్మను మృదంగ నాద విభూషణ బిరుదుతో ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ దీపిక రెడ్డి, డాక్టర్ దారూరి రాఘవాచారి, త్రిచూర్ బ్రదర్స్ రాంకుమార్ మోహన్, డాక్టర్ జొన్నలగడ్డ అనురాధ, కలెక్టర్ స్నేహ శబరీష్, సినీ నటుడు తనికెళ్ళ భరణి తదితరులు పాల్గొన్నారు. వాతాపి గణపతిమ్ భజేతో ప్రారంభమైన ఈ సంగీత విభావరి బ్రహ్మకడిగిన పాదము, బంటురీతి కొలువు, నగుమోము, బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, పలుకే బంగారమాయేనా వంటి అనేక శాస్త్రీయ కీర్తనలతో సంగీతాభిమానులను అలరించింది. అనంతరం ఫ్యూజన్ సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.నాలుగేళ్ల చిన్నారి శ్రీకరి నుంచి యువ, సీనియర్ కళాకారుల వరకు పాల్గొన్న ఈ గ్రాండ్ వయోలిన్ సింఫనీ ఆద్యంతం సంగీత మాధుర్యాన్ని పంచింది. చివరగా ఆరభి సంస్థ సంగీత విద్యార్థులు తమ గురువు డాక్టర్ అశోక్ గుర్జాలేను ఘనంగా సత్కరించారు.

11నుండి మండలంలో విద్యా వారోత్సవాలు

-ఎంఈఓ శంకర్ రాథోడ్

అత్తాపూర్ మే9 ,ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఇందులో భాగంగా రాజేంద్రనగర్ మండలంలో విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు.శనివారం ఎంఈఓ శంకర్ రాథోడ్ ఒ ప్రకటనలో మాట్లాడుతూ... స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఈనెల 11వ తేది నుండి 17వ తేది వరకు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.11న ఫౌండేషన్ డే కార్యక్రమాలు,12న పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల కోసం రివిజల్ కార్యక్రమాలు,13న నియోజకవర్గ స్థాయిలో పాఠశాల విద్యా నిర్వహణపై సర్పంచ్లకు సదస్సు,14న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట,15న గ్రంథాలయ నిర్వహణ ,16న ఆర్ట్స్ అండ్ కల్చరల్ ,17న విద్యార్థుల విజయోత్సవాలు నిర్వహించనున్నామని ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,యువజన సంఘాలు,విద్యార్థి సంఘాలు నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బిఎంటిపై బసవతారకంలో నర్సింగ్ సదస్సు

సదస్సును ప్రారంభిస్తున్న జేఎస్ఆర్ ప్రసాద్, చిత్రంలో ఇతర వైద్యులు ఉన్నారు.

జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్త: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో 'బోన్ మారో ట్రాన్స్ప్లాంట్(బిఎంటి) నర్సింగ్- విజ్ఞానం, ఆచరణల మధ్య వారధి' అనే అంశంపై శనివారం ఒక రోజు నర్సింగ్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది నర్సింగ్ నిపుణులు హాజరయ్యారు. సదస్సును ట్రస్ట్ బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్, అసోసియేట్ డైరెక్టర్ డా. కల్పనా రఘునాథ్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా. సెంథిల్ జే. రాజప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఫణి కోటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కందుల శ్రీవాణి తదితరులు ప్రారంభించారు. డా. కల్పనా రఘునాథ్, ఆంకాలజీ నర్సింగ్లో పనిచేసే నర్సులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డా. సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ బిఎంటి సంరక్షణలో ఆధారాధారిత వైద్య విధానాలను నర్సులు సమర్థంగా అమలు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఇప్పటివరకు 700కు పైగా బోన్ మారో ట్రాన్స్ప్లాంట్ చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని, అందులో 200 చిన్నారుల కేసులు ఉన్నాయన్నారు. ఈ విజయాల్లో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారని అభినందించారు. సదస్సులో టాటా మెమోరియల్ హాస్పిటల్, రాజీవ్ గాంధీ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ తదితర జాతీయ సంస్థలకు చెందిన నిపుణులు కండిషనింగ్ రెజిమెన్లు, కార్ట్ సెల్ థెరపీ, ట్రాన్స్ప్లాంటేషన్ సమస్యలు, సపోర్టివ్ కేర్ నర్సింగ్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సదస్సు ద్వారా బిఎంటి నర్సింగ్లో ఆధునిక వైద్య విధానాలు, రోగి సంరక్షణలో నర్సుల కీలక పాత్రపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం : సీతారాం ధూళిపాళ

మణికొండలో "వాక్ ఫర్ వాటర్" కరపత్రంను విడుదల చేస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం.

నార్సింగి, మే 9 ప్రభాతవార్త : మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17.వ,తేదీన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమాన్ని చేపడుతున్నామని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శనివారం మణికొండలో వాక్ ఫర్ వాటర్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రంను బిఆర్ఎస్ నాయకులు ఉపేంద్రనాథ్రెడ్డి, లక్ష్మణ్రావ్లతో కలిసి సీతారాం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారం కోసం రాజేంద్రనగర్ బిఆర్ఎస్ ఇంచార్జి పి.కార్తిక్రెడ్డి నాయకత్వంలో వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17.వ, తేదీన సాయంత్రం 4:30.గంటలకు నెక్నాంపూర్ చింతచెట్టు బటర్ఫ్లై కూడలి నుంచి మర్రిచెట్టు కూడలిలోని జలమండలి కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ కార్యక్రమం ఉంటుందని వివరించారు. మనం ఏ పని చేయాలన్నా నీరు అవసరం ఉంటుందని, ప్రజలకు అవసరమైన మంచినీటిని సరఫరా చేయడంలో అధికారగణం ఘోరంగా విఫలం అవుతుందన్నారు. ప్రజలు ఇళ్లల్లో వేసుకున్న బోర్లన్నీ ఎండిపోయాయని, జల మండలి నుంచి సరఫరా చేస్తున్న నీరు సన్నని ధారవలే వస్తుందని, వాడుకునేందుకు, తాగేందుకు నీరు లేక మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. ప్రజల పక్షాన బిఆర్ఎస్ చేపడుతున్న వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువ వైద్యులకు న్యూరో సైన్సెస్లో మాస్టర్ శిక్షణ

శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్య బృందం

సికింద్రాబాద్, మే 9 ప్రభావార్త: న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో వస్తున్న ఆధునిక మార్పులు, అత్యాధునిక చికిత్సా విధానాలపై యువ వైద్యులకు అవగాహన కల్పించేందుకు శనివారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాల అలుమ్ని ఆడిటోరియంలో మాస్టర్ క్లాస్ ఇన్ న్యూరాలజీ న్యూరోసర్జరీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రెనోవా ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (ఆర్ఐఎన్ఎస్) న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాలు, గాంధీ ఆసుపత్రి న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాలు, పాన్ రీసెర్చ్ ఫౌండేషన్, తెలంగాణ న్యూరోసైన్సెస్ సొసైటీ (టీఎన్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ రెండు రోజుల శిక్షణా సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా సదస్సులో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 80 మందికి పైగా పీజీ వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు హాజరయ్యారు. కార్యక్రమాన్ని తెలంగాణ న్యూరోసైన్సెస్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డా. ధైర్యవాన్, సెక్రటరీ డా. ఎన్. ప్రతాప్ కుమార్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డా. డి. రాజా రెడ్డి, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఓఓ రవీంద్రనాథ్ గరగ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణ అధ్యక్షుడు డా. జె.ఎం.కె. మూర్తి, నిర్వహణ కార్యదర్శులు డా. టి.వి.ఆర్.కె. మూర్తి, డా. సయ్యద్ అమీర్ బాషా పస్పాల మాట్లాడుతూ న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ మాస్టర్ క్లాస్ ద్వారా వారి క్లినికల్ నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యమని తెలిపారు. రోగుల నిర్ధారణకు సంబంధించిన ప్రాథమిక పరీక్షా విధానాలు, క్లినికల్ కేస్ డిస్కషన్స్, మాక్ ఎగ్జామినేషన్ సెషన్ల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సు నిర్వహణలో గాంధీ ఆసుపత్రి న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. శ్రీనివాస్, ప్రొఫెసర్ కె. రవి, న్యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. రమేష్ కీలక పాత్ర పోషించడమే కాకుండా, విద్యార్థులకు తమ అమూల్యమైన సూచనలు అందించారు. సీనియర్ ప్రొఫెసర్లు తమ అనుభవాలను పంచుకుంటూ, పరీక్షల సమయంలో విద్యార్థులు పాటించాల్సిన మెళకువలను వివరించారు. హైదరాబాద్తో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రతిష్టాత్మక వైద్య సంస్థలకు చెందిన సీనియర్ అధ్యాపకులు ఈ సెషన్లలో బోధకులుగా వ్యవహరించారు. బోధనాత్మక ఉపన్యాసాలు, ప్రాక్టికల్ ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. వైద్య విద్యార్థులలో క్లినికల్ ప్రాక్టీస్పై సమగ్ర అవగాహన కల్పించేందుకు రెనోవా ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (ఆర్ఎన్ఐఎస్) నిరంతరం కృషి చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇలాంటి మరిన్ని విద్యా సదస్సులను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త నిర్వహణ కార్యదర్శులు డా. మురళీధర్ రెడ్డి , డా. లలిత పి, పలువురు సీనియర్ న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు పాల్గొన్నారు.

చైతన్యానికి ప్రతీక బుర్రకథ

..ఆచార్య కొలకలూరి ఇనాక్

బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్, పద్మశ్రీ ఆచార్య కొలకనూరి ఇనాక్, చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) : తెలుగు నేల గర్వించదగ్గ అద్భుతమైన కళా ప్రక్రియ బుర్రకథ అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్, పద్మశ్రీ ఆచార్య కోలకనూరి ఇనాక్ కొనియాడారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికలో గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో నక్క ఉప్పలయ్య బృందం చే సీతాకళ్యాణం అద్భుతంగా నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య కోలకనూరి ఇనాక్ మాట్లాడుతూ సాంఘిక చైతన్యానికి, చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బుర్రకథ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. తెలుగు జానపద కళారూపాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో గానసభ నిర్వాహకులు ఏర్పాటు చేయడం విశేషమని అన్నారు.కళాకారులను ఆదరిస్తున్న గానసభ అధ్యక్షుడు జనార్ధన మూర్తి అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యుడుశ్రీనివాస్ పాల్గొన్నారు.

కేబీఆర్ ఉద్యానవనం వద్ద బిఆర్ఎస్ ఆందోళన

ఆందోళన నిర్వహిస్తున్న మన్నె గోవర్ధన్రెడ్డి, ఇతర బిఆర్ఎస్ నేతలు

జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్త: హెచ్-సిటీ పేరుతో కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ చెట్లను నరకడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కేబీఆర్ ఉద్యానవనం ముందు ఆందోళన నిర్వహించారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్రెడ్డి, జార్వల నవీన్నాయక్ల ఆధ్వర్యంలో ఇక్కడ ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకొని ఆందోళన చేపట్టారు. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయడం దారుణమని మన్నె గోవర్ధన్రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి పచ్చ దనంపై ఒక స్పష్టమైన వైఖరి లేదని, అందుకో ఎన్నో ఏళ్ల నుంచి నీడనిస్తున్న చెట్లను తొలగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి : తోకల శ్రీనివాస్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

చార్మినార్,మే 9 ప్రభాతవార్త :
మైలార్దేవ్పల్లి కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గానికి చెందనముఖ్య నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్లోని పరేడ్ గ్రౌండ్లో ఆదివారం జరగనున్న బహిరంగ సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విచ్చేయనున్నారని,మైలార్దేవ్పల్లి డివిజన్ నుంచి 30 బస్సులు,150 కార్లు,మూడు వేలు పైగా జన సమీకరణతో బయలు దేరాలని తెలిపారు.పరేడ్ గ్రౌండ్ రంగ సభను విజయవంతం చేయాలని ఆయన బిజెపి నాయకులను కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బుచ్చిరెడ్డి,అడికే జనార్ధన్,బబ్లూ, ఎల్వి రెడ్డి,పృద్ధీరాజ్,బొల్ల రామకృష్ణ,కృష్ణ జయంతి, అంజమ్మ,ఎండి షకీల్,సురేష్తో పాటు పలువురు పాల్గొన్నారు.

కిడ్నాప్ వ్యవహారంలో రౌడీషీటర్లు!

- టాస్క్ఫోర్స్ అదుపులో ఐదుగురు నిందితులు

జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్త:
ప్రేమ వ్యవహారంలో కిడ్నాప్కు పాల్పడి డబ్బులు దండుకున్న ముఠాలోని అయిదుగురు సభ్యులు టాస్క్ఫోర్స్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ముఠాలో ఇద్దరు నిందితులు రౌడీషీటర్లుగా ఉన్నట్లు తెలుస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసులమంటూ కొందరు వ్యక్తులు నిఖిల్, సాయి, మహేష్లను కిడ్నాప్ చేసి మొయినాబాద్ సమీపంలో దాడికి పాల్పడి వారి నుంచి రూ. 33లక్షలకుపైగా వసూలు చేసిన విషయం విదితమే. ఈ సంఘటనలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అయిదుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా వారిలో ఇద్దరు రౌడీషీటర్లు ఉన్నట్లు గుర్తించారు. కాగా ప్రేమ వ్యవహారంలో యువతి గతంలో నిఖిల్పై కేసు పెట్టడంతో అతను కోర్టు నుంచి అరెస్ట్ చేయకుండా ఆర్డర్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే నిఖిల్కు బుద్ది చెప్పాలని ఈ ముఠా సహకారం తీసుకొంది. ఈ క్రమంలోనే ముఠా డబ్బు వసూలుకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా నిందితులు అదుపులో ఉన్నట్లు పోలీసులు ధృవీకరించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని బంజారాహిల్స్ పోలీసులు స్పష్టం చేశారు.

రంగనాథస్వామి రథోత్సవంలో మంత్రి

రథోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, మే 9, ప్రభాతవార్త:
అందోలు లోని శ్రీ భూనీళాసమేత రంగనాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారంనాడు రాత్రి నిర్వహించిన రథోత్సవంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ముందుగా రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయకొట్టిన అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ రథోత్సవ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. కాగా, ఈరథోత్సవం కన్నులపండుగగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు రంగనాథస్వామి నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు అందోలుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

ప్రధాని మోడీ సభను విజయవంతం చేద్దాం

సిద్దిపేట అర్బన్, మే 9, ప్రభాతవార్త :
సికింద్రాబాద్‌లో ఈనెల 10న జరిగే ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మోడీ మూడోసారి ప్రధాని మంత్రిగా అయ్యాక తెలంగాణకు మొదటిసారి వస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా రూ.9వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. గతంలో తెలం గాణ అభివృద్ధికోసం రూ.13లక్షల కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. దేశంకోసం మోడీ.. మోడీ కోసం మనం నినాదమే లక్ష్యంగా ముందుకు వెళ్దామన్నారు. జిల్లా బిజెపి నాయకులు, కార్య కర్తలు, మోడీ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బాసంగారి వెంకట్, గందె సంతోష్, ఉమా, తుంగ కనకయ్య, కెమ్మసారం సంతోష్, సునీల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం హేయమైన చర్య

-పిఆర్టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు మేడి సతీష్‌రావు, ప్రధాన కార్యదర్శి

నర్సాపూర్, మే 9, ప్రభాతవార్త:
2003 డిఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని డివిజన్ బెంచ్ స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ వేయ డం హేయమైన చర్య అని పిఆర్టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు మేడి సతీష్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్ తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, 2004కు ముందు నోటిఫికేషన్ జారీచేసి, అనంతరం నియామకాలు పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అమలు చేస్తోందని వారు గుర్తుచేశారు. ఇదేవిధంగా పలు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు 57/4, 57/5 ప్రకారం అమలు చేశాయని, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టుతీర్పులను, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్నీ పరిగణనలోకి తీసుకోకుండా అధికార యంత్రాంగం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడం సరికాదని వారు విమర్శించారు. ఉద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి, కోర్టు ఉత్తర్వుల ప్రకారం 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

హనుమాన్ జయంతి వేడుకలకు సిద్ధమైన మాలధారణ భక్తులు

మర్కుక్, మే 9 (ప్రభాతవార్త):
మండలకేంద్రంలోని శ్రీసంకటవిమోచన హనుమాన్ దేవాలయంలో హనుమాన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి అభిషేకం, లింగార్చన కార్యక్రమాలను నిర్వహించారు. మాలధారణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. ఆలయం ఏర్పాటైన నాటినుంచి ప్రతి ఏడాది మాలధారణ భక్తులసంఖ్య పెరుగుతుండగా, ఈసారి 40మందికిపైగా భక్తులు మాల ధారణ చేపట్టడం విశేషం. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ సాయిని మహేష్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శనివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. అలాగే ప్రతి నెల పూర్వభద్ర నక్షత్రం రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమాన్ స్వాములు ఆదివారం బయలుదేరి మాల విరమణ చేసి తిరిగి ఆలయానికి చేరుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో స్వాములు సాయికుమార్, ఆంజనేయులు, శ్రీధర్, బలరాం, బాబు, వెంకటేష్, సంజీవరెడ్డి, వినయ్, మహేష్, స్వామి, ప్రవీణ్, పర్వతాలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్

గృహప్రవేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్

నారాయణఖేడ్, మే 9, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు చందఖాన్‌పల్లిలో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ షెట్కార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్‌కు చెందిన లబ్ధిదారులు మేటి చంద్రమ్మ విట్టల్ దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవంలోపాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, గడ్డిల నర్సింలు, పాండు, జ్ఞానేశ్వర్ తదితరులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో కొత్త బోరుబావి ప్రారంభం

-చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్

గుమ్మడిదల, మే 9, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీలో తాగునీటి కొరత తలెత్తకుండా మున్సిపల్ పాలకవర్గం చర్యలను వేగవంతం చేస్తోంది. 15వవార్డులో ప్రజలకు తాగు నీటి సౌకర్యం మెరుగుపర్చేందుకు నూతన బోరుబావి పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ పొన్నాల ప్రమీల ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతి వార్డులో తాగునీటి వసతులను విస్తరించేందుకు ప్రత్యేకప్రణాళికలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చీమల సంధ్య రెడ్డి, కౌన్సిలర్లు మాధవి, రమేష్, చక్రపాణి, కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, నాయకులు వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, శేఖర్ రెడ్డి, వార్డు యువకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమరవాణా చేస్తే కఠినచర్యలు

-చేర్యాల ఎస్సై అపూర్వరెడ్డి

చేర్యాల, మే 9, ప్రభాతవార్త:
చేర్యాల మండల పరిధిలో ఎక్కడైన ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపారు. ఇండ్ల నిర్మాణాల పేరుతో ఎక్కడ పడితే అక్కడ ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తే సీజ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇసుక కావాల్సిన వారు ప్రభుత్వ అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

పార్టీ బలోపేతంలో యువతే కీలకం..

-జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్

పాపన్నపేట, మే 9, ప్రభాతవార్త:
మండల అధ్యక్షులుగా యువ నాయకుల నియామకం పార్టీ బలోపేతానికి యువతే కీలకమని భావించిన పార్టీ అధిష్ఠానం మండల స్థాయిలో యువ నాయకులకు పెద్దపీటవేస్తోంది. ఈక్రమంలో పలువురు యువ నాయకులను మండల అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీశ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. గ్రామస్థాయి నుంచి ప్రజలతో మమేకమై పనిచేసినవారికే బాధ్యతలు అప్పగించామని డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ తెలిపారు. కొత్తగా నియమితులైన పాపన్నపేట మండల అధ్యక్షులు లింగంపేట నరేందర్ గౌడ్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యువతకు అవకాశాలు కల్పించడం ద్వారా పార్టీకి కొత్త దిశ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జిల్లాడీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువ నాయకులు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

11 నుంచి తొలి దశ జనగణన

-ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలి: తహసీల్దార్ విష్ణుసాగర్

మనూర్, మే 9, ప్రభాతవార్త:
ఈ నెల 11వ తారీఖు నుంచి మండలంలో జనగణనలో భాగంగా తొలి దశ ఇండ్ల జాబితా నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుందని తహసీల్దార్ విష్ణుసాగర్ అన్నారు. ఎన్యూమేటర్లు ఇండ్లకు వచ్చినప్పుడు సరైనసమాచారం ఇచ్చి ప్రజలు తమ వంతు సహకరించాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు వారి వారి పంచాయితీలలో టాం టాం వేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వే సజావుగా సాగేలా క్షేత్రస్థాయి సిబ్బందికత గు ఆదేశాలు జారీ చేశామని,ప్రజలు తమ వంతు సహకారం అందించాలని తహసీల్దార్ విష్ణుసాగర్ మండల ప్రజలకు సూచించారు.

పాత పాలకవర్గానికే పిఎసిఎస్ బాధ్యతలు



సహకార సంఘంలో బాధ్యతలు స్వీకరించిన సభ్యులు

కొల్చారం, మే 9, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల కొనసాగింపుపై హైకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పాలకవర్గాల నియామకం జరిగే వరకు ప్రస్తుతం ఉన్న పాత కమిటీలనే కొనసాగించాలని సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం అంసాన్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘంలో పాతపాలకవర్గం తిరిగి బాధ్యతలు స్వీకరించనుంది. సంఘం చైర్మన్‌గా మన్నె రాములు, వైస్ చైర్మన్‌గా గంగాపురం నర్సగౌడ్ మళ్లీ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. అనంతరం చైర్మన్ మన్నె రాములు, వైస్‌చైర్మన్ గంగాపురం నర్సగౌడ్‌లను డైరెక్టర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఆంజనేయులు, డైరెక్టర్లు గడ్డమీద సత్యనారాయణ, కన్యాబోయిన రమేష్ రామన్న, దోమకొండ సంజీవులు, బండ భూమయ్య, గంగాపురం జనార్దన్ గౌడ్, గొల్లపల్లి రుక్కమ్మ, లంబాడి దేవ్‌సింగ్, నీరుడి వెంకమ్మ, లంబాడి అంబోర్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల వినూత్న కార్యక్రమాలకు ఎన్ఆర్ఎల్ఎం బృందం ఫిదా

మహిళా సంఘాలతో మాట్లాడుతున్న బృందం

గుమ్మడిదల, మే 9, ప్రభాతవార్త:
గ్రామీణమహిళల ఆత్మవిశ్వాసం, సంఘటితశక్తి ఎలాగ్రామాభివృద్ధికి దోహద పడుతుందో కనుకుంట, వీరారెడ్డిపల్లి గ్రామాలు నిరూపిస్తున్నాయని నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ బృందం అభిప్రాయపడింది. ఫుడ్, న్యూట్రిషన్, హెల్త్ అండ్ వాష్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఈగ్రామాల్లో పర్యటించిన బృందం మహిళా సంఘాల పనితీరును పరిశీలించింది. కానుకుంట గ్రామసంఘాల విజన్ ప్రణాళిక, మహిళల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు బృందాన్ని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఇంటింటా పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని సభ్యులు ఆసక్తిగా పరిశీలించారు. తెలంగాణ సంస్కృతి, ఆరోగ్య చైతన్యాన్ని మిళితం చేస్తూ మహిళలు రూపొందించిన మిల్లెట్ బోనం, వెజిటేబుల్ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ మహిళల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు చేపడుతున్న చర్యలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కనుకుంట సర్పంచ్ పెంటారెడ్డి, ఉప సర్పంచ్ పాషా, నేషనల్ మిషన్ మేనేజర్ వసుధ శుక్ల, స్టేట్ నోడల్ పర్సన్ సురేఖ, జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పి.రాజు, ఆర్.మాధురి, వెంకటేశ్వర్, జిల్లా అధికారులు ఏపీఎం హెచ్‌డీ వెంకట్, ఏపీఎం ఐబీ శివకుమార్, ఏపీఎం నరేందర్ కుమార్, సీసీలు భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, వీఓఏలు కల్పన, మహేశ్వరి, రేఖతో పాటు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు

-ఆయిల్ పామ్ కంపెనీ డైరెక్టర్, మండల వ్యవసాయ అధికారిణి

కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్ రంగనాయకులు, ఏవో దీపిక

నర్సాపూర్, మే 9, ప్రభాతవార్త:
రైతులు ఆయిల్ పామ్ పంటసాగుతో రైతుల ఇంట సిరుల పంట పండుతుందని, అదేవిధంగా పంటమార్పిడిపద్ధతి వల్ల పంటల్లో అధిక దిగుబడులు వచ్చి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆయిల్ పామ్ కంపెనీ డైరెక్టర్ రంగనాయకులు అన్నారు. శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలులో భాగంగా ఆరవ రోజు నర్సాపూర్‌లోని రాయిరావు చెరువు కట్టపై, నత్తనాయిపల్లి గ్రామంలో సమతుల్య నీటివినియోగం, పంటమార్పిడి అనే అంశంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసదస్సులో పాల్గొన్న ఆయిల్ పామ్ కంపెనీ డైరెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ పంటపండించడంద్వారా వచ్చే ఆదాయం అధికంగా ఉంటుందన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి దీపిక పంటమార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తూ కోతుల బెడద వల్ల పంట మార్పిడికి నిరాకరిస్తున్న రైతులకు ఆయిల్ పామ్ పంట ఒక వరమని తెలిపారు. అనంతరం నీటిపారుదలశాఖ ఏఈ శ్రీనిధి మాట్లా డుతూ సమతుల్య నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, మున్సిపల్‌చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, నీటిపారుదల ఏఈలు మణిభూషణ్, శ్రీనిధి, అధికారులు మోహన్ రూతు, లివ్ పామ్ కంపెనీ అధికారులతోపాటు అధికారిణి దీపిక, వేయి రమణమూర్తి, మోహన్, తేజస్విని, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు కార్యక్రమంలో ఎమ్మెల్యే

ప్రతిభవంతులకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సదాశివపేట, మే 9, ప్రభాతవార్త:
పట్టణంలో ఒప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం నాడు సామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక సామాజిక కార్యక్రమం నిర్వహించారు సామ్ ట్రస్ట్ చైర్మన్ షేక్ అంజుమ్ ఆధ్వర్యంలో శాసనసభ్యులు చింత ప్రభాకర్ చేతులమీదుగా అవార్డు పంపిణీ చేయడం జరిగింది. మెహందీ డిజైన్ విజేతలు, టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు కుట్టు మిషన్ పంపిణీచేయడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సాధించిన విద్యార్థులనుకూడా సన్మానించి నగదు బహుమతులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామ్ ట్రస్ట్ సదాశివపేట వాళ్ల సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం చాలా అభినందనీయం అని చింత ప్రభాకర్ వారిని కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో అక్బర్ హుస్సేన్ ఈద్గా కమిటీ అధ్యక్షులు మరియు కౌన్సిలర్లు సోమశేఖర్, ఫణి కృష్ణ, మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ టిఆర్ఎస్ నాయకులు నాగుల విజయకుమార్ లతేఫ్ నసీరుద్దీన్ శ్రీహరి, హాజీ తదితరులు పాల్గొన్నారు.

రేపు కొత్తూరులో తైబజార్ వేలం

ములుగు, మే 9, ప్రభాతవార్త:
మండలపరిధిలోని కొత్తూరుగ్రామంలో సోమవారం ఎంపివో కలీం ఆధ్వర్యంలో తైబజార్ వేలం జరుగుతుందని గ్రామ సర్పంచ్ గడీల సరిత గోవర్ధన్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.50వేలు డిపాజిట్ చేయాలన్నారు. అలాగే ఎవరైతే వేలం పొందుతారో వారు అందులో సగం డబ్బులు ముందుగానే గ్రామపంచాయతీకి చెల్లించాలని సూచించారు. వేలం దక్కని వారికి డిపాజిట్ చేసిన డబ్బులు అప్పుడే తిరిగి ఇచ్చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు: డిఎస్పీ

నారాయణఖేడ్, మే 9, ప్రభాతవార్త:
రహదారులపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మహదేవ్‌పల్లి వద్ద జాతీయ రహదారి 161 సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రోడ్లపై కుప్పల వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, వాటిని వెంటనే తొలగించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్సై రవిగౌడ్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ పంటపై అవగాహన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ ఉదయ్‌కుమార్ అధికారులు తదితరులు

నర్సాపూర్, మే 9, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండల పరిధిలోని నత్నయపల్లి గ్రామ సర్పంచ్ ఉదయ్‌కుమార్, ఉపసర్పంచ్ ఎల్లంల అధ్వర్యంలో, రైతులతో గ్రామంలో ఆయిల్ పామ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగు చేయడానికి రైతులు ముందుకువచ్చారు. ఈసందర్భంగా ఆయిల్‌పామ్ అధికారులు, వ్యవసాయాధికారులు రైతులకు ఆయిల్ పామ్ పంటపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, నీటిపారుదల ఏఈలు మణిభూషణ్, శ్రీనిధి, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్‌రూతు, లివ్‌పామ్ కంపెనీ అధికారులతోపాటు మండల వ్యవసాయ అధికారిణి దీపిక, వేయి రమణమూర్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్, తేజస్విని, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు బోర్ వేసిన సర్పంచ్

నర్సాపూర్, మే 9, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని విట్టల్ తండాలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకుగాను బోర్ వేయించడమే శాశ్వతపరిష్కారమని భావించిన బ్రాహ్మణపల్లిసర్పంచ్ ఆనంద్‌కుమార్‌యాదవ్ శనివారం బోర్ వేయించారు. విట్టల్ తండాలో తాగునీటి సమస్య నెలకొన్నగా తండావాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దూరప్రాంతాల్లోని వ్యవసాయ బోర్ల వద్ద తాగునీటిని తెచ్చుకుంటూ అష్టకష్టాలుపడ్డారు. ఈ తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రహించిన గ్రామసర్పంచ్ ఆనంద్‌కుమార్ యాదవ్ స్పందించి ఉపసర్పంచ్ యాదయ్యతో కలిసి బోర్ వేయించారు. దీంతో ఈ విటల్ తండాలో తాగునీటి సమస్య నీటి కొరత తీరనుంది. బోర్ వేయించి తండాలో తాగునీటి సమస్య పరిష్కరించినందుకు గ్రామ సర్పంచ్ ఆనంద్‌కుమార్‌యాదవ్‌కు ఆ తండావాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్‌కుమార్‌యాదవ్‌తోపాటు ఉపసర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద, మే 9, ప్రభాతవార్త:
మండల పరిధిలోని కిషన్ నాయక్ తండాలో శనివారం నేనావత్ ప్రతాప్, జాదవ్ మంజుల వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

మెగా హెల్త్ క్యాంప్‌ను విజయవంతం చేయండి

-క్యాంప్‌ను ప్రారంభించనున్న చుక్క రాములు

అమీన్‌పూర్, మే 9, ప్రభాతవార్త:
మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా సిఐటియు, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రజలు విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి నాయిని లలిత కోరారు. బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ మరియు ఈఎస్ఐ రామచంద్రపురం వారి సహకారంతో క్యాన్సర్‌కు సంబంధించిన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా షుగర్, రక్త పరీక్షలు కూడా చేపడతామని చెప్పారు. దేశంలో ప్రతిరోజూ అనేక మంది మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారని, సరైన సమయంలో వ్యాధిని గుర్తించకపోవడం, నిపుణులైన వైద్యులను సంప్రదించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా వ్యాధిని గుర్తించి ప్రజలకు సరైన అవగాహన కల్పించేందుకు నిపుణులైన వైద్యులతో ఈ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఈఎస్ఐ సూపరింటెండెంట్ సత్యనారాయణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. బీరంగూడప్రాంత ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బీరంగూడలోని మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

మోడల్ స్కూల్‌లో సమ్మర్ క్యాంప్

నర్సాపూర్, మే 9, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామ సమీపంలోగల తెలంగాణ మోడల్ స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫర్హానా, పీడి అశోక్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుం చి 25వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సమ్మర్‌క్యాంప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసమ్మర్‌క్యాంపులో 6వతరగతి నుంచి 9వతరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికే ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపులో భాగంగా హ్యాండ్ రైటింగ్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్, ఇండోర్ గేమ్స్, అబాకస్ వంటి అంశాల్లో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యం

ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

సిద్దిపేట రూరల్, మే 9, ప్రభాతవార్త:
ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని..విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రజక న్యాయవాదుల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం రజక న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రజక మెరిట్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కారించారు. టెన్త్‌లో 584,583,562 మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఇంటర్‌లో 465,461, 435 మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా ప్రోత్సహించారు. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధ్యమేనని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, సమాజానికి గర్వకారణంగా నిలవాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించి సమాజానికి ఆదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో చిన్న రాజ్ పందరి, భూంపల్లి శ్రీహరి, కోడూరు రాము, రమేష్, భాను ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత త్రాగునీరు కేంద్రం ఏర్పాటు

ఉచిత చల్లని త్రాగునీరు కేంద్రంను ప్రారంబిస్తున్న సర్పంచ్ ఆదర్శ్

వెల్దుర్తి, మే 9, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ దగ్గర శనివారం చలటి తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవికాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు డాక్టర్ కీర్తిశేషులు నర్సింలు. కీర్తిశేషులు మెడికల్ సిద్ధిరాములు జ్ఞాపకార్థం వీరి కుమారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్. స్థానిక సర్పంచ్ ఆదర్శ్. ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్. బిజెపి జిల్లా నాయకుడు శ్రీనివాస్ గౌడ్. రవీందర్ గుప్తా. రవికుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. కాగా సర్పంచ్ ఆదర్శ్ చల్లటి తాగునీటికేంద్రాన్ని బటన్ ఆన్‌చేసి ప్రారంభించారు. ఈకేంద్రం ప్రజలదాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అన్నారు. దీనిని మండల ప్రజలతోపాటు ఇతర మండలాల ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్. స్థానిక సర్పంచ్ ఆదర్శ్. ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ధర్మారంలో ప్రజాపాలన ప్రగతిప్రణాళిక

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పాల్గొన్న రైతులు

వెల్దుర్తి, మే 9, ప్రభాతవార్త:
మండలంలోని ధర్మారం గ్రామంలో శనివారం నాడు ప్రజా పాలన. కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఏఎ్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈసందర్భంగా చెరువులు. వాటి ప్రాముఖ్యత. అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు. రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచౌడలమ్మ విగ్రహప్రతిష్ఠ

చౌడలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు, మే 9, ప్రభాతవార్త:
మండల పరిధిలోని విఠలాపూర్ శనివారం చౌడలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ:సంతోషాలతో ఉండాలన్నారు. గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ యాదవసంఘం సభ్యులు, మహిళలు, యువకులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో ఘనంగా మదర్స్ డే

-అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

అమీన్‌పూర్, మే 9, ప్రభాతవార్త:
అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సమాజంలో తల్లుల పాత్రను గౌరవిస్తూ, మహిళల సేవలను గుర్తిస్తూ ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా అసోసియేషన్ మహిళాసభ్యులు యశోదర, రమణి, అనిత, శిరీష, పద్మ, ఝాన్సీ, కల్పన, వర్షిత్ తదితరులు మాట్లాడుతూ మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళల ప్రతిభను ప్రోత్సహించే సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదకార్యక్రమాలు, ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఆసక్తికరం ప్రజాకళలో నవలాకారుల అనుభవసారం

రవీంద్రభారతి, మే 9 ప్రభాతవార్త :
తెలంగాణరాష్ట్రప్రభుత్వ భాషాసాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా.ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళాసాంస్కృతిక మహోత్స వాలలో భాగంగా 4 నుండి 11వ తేదీవరకు కొనసాగే సాహిత్యవారం ఈరోజు జరిగిన నవలాకారుల అనుభవసారం కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగాసాగింది. ప్రముఖసాహితీవేత్త కె.పి.అశోక్ కుమార్ నిర్వహణలో జరిగిన ఈకార్యక్రమంలో ప్రముఖ నవలారచయితలు అంపశయ్య నవీన్, ఎం.ఎస్.ప్రాణ్‌రావు, పి.చంద్, పెద్దింటి అశోక్ కుమార్, శిరంశెట్టి కాంతారావు, ప్రభాకర్‌జైనీ మొదలైన రచయితలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సంచాలకుడు డా.ఏనుగు నరసింహారెడ్డి నవలారచయితలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటలతో అలరించారు.

రైతులు చనిపోతున్నా సిఎంకి సోయి లేదు

-మూసీ, ఫ్యూచర్ సిటీ మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేదు
-బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరీష్‌రావు

చిన్నకోడూరు, మే 9, ప్రభాతవార్త:

మూసీ, ఫ్యూచర్‌సిటీ మీద ఉన్న ప్రేమ..కాంగ్రెస్ సర్కార్‌కు రైతుల మీద లేదని, నెలల తరబడి వడ్లు కొనక రైతులు చనిపోతున్నా సిఎం రేవంత్ రెడ్డికి సోయిలేదని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మాజీమంత్రి హరీష్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలకేంద్రంలోని పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరుగు, నిబంధనల పేరుతో రైతులను కాంగ్రెస్ సర్కార్ దోచుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అకాలవర్షాలు, వడగండ్ల వానలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ సర్కార్ కొనుగోలు కేంద్రాలను గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ధాన్యం కొనుగోలుపై ఒక్క సమీక్షా నిర్వహించలేదన్నారు. బిఆర్ఎస్‌పాలనలో వరికోతలు ప్రారంభం కాగానే మంత్రులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి రైతులకు సరిపడా గన్నీ బ్యాగులు, లారీలు, డబ్బులు సిద్ధం చేసి రైతులను కంటికిరెప్పలా కాపాడుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పండించిన పంటను అమ్ముకోవడానికి నెలలతరబడి పడిగాపులు కాయాల్సివస్తుందన్నారు. చిన్నకోడూరు ప్రాంతంలో ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల సన్‌ఫ్లవర్ పండుతుంటే కేవలం ఆరున్నర క్వింటాళ్లు కొంటామని నిబంధనపెట్టి తీరా ఆరున్నర క్వింటాళ్లు కూడా కొనలేదన్నారు. రైతులకు సంచులు సరఫరా చేసే దమ్ములేదు గాని, 69 సార్లు ఢిల్లీకి పోయి మూటలుమోయడానికి మాత్రం రేవంత్ రెడ్డికి టైమ్ ఉందన్నారు. ఎసి రూములో కూర్చుని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూపర్‌గా కొనుగోళ్లు చేస్తున్నామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, అంత సూపర్‌గా కొంటే రైతులు ఎందుకు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని, వడ్ల కుప్పల మీద గుండె ఆగి ఎందుకు చనిపోతున్నారని ప్రశ్నించారు. కల్లాల కాడికి వస్తే మీబండారం బయటపడుతుందన్నారు. సిద్దిపేట మార్కెట్‌యార్డుకు గత నాలుగు రోజులుగా తాళం వేశారని తెలిపారు. వడ్లతో పాటు సన్‌ఫ్లవర్, జొన్నలు, మక్కలు, శనగలు తక్షణమే యుద్ధప్రాతిపదికన కొనుగోలుచేసి రైతులకు మద్దతుధర అందించాలన్నారు. ఆయనవెంట కూర మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్, కాముని ఉమేష్, జంగిటి శ్రీనివాస్, సామల మధు, బాలయ్య, కొండం రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం మండలపరిధిలోని విఠలాపూర్‌గ్రామంలో జరిగిన చౌడలమ్మ విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ ఉత్సవాలలోపాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నల్లవాగు ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు

నల్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

సిర్గాపూర్, మే 9, ప్రభాతవార్త:

మండలంలోని నల్లవాగు ప్రాజెక్టును శుక్రవారం ఇరిగేసన్ ఈఈ సుందర్, డిఈఈ విజయ్‌భాస్కర్, జలంధర్‌లు సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించిన అధికారులు రైతులతో సమావేశం అయి పలు విషయాలపై ఆరాతీశారు. సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు అధికారులు సూచించారు. కాల్వలద్వారా నీటిని వదిలినప్పుడు వృథాచేయకుండా, చివరి ఆయకట్టు రైతుకు నీరు అందేలా ఎవరికివారు తమవంతు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎ.శ్రీవర్ధన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

అడుగంటిన కూడుకుంట చెరువు



కడ్పల్ శివారులో ఎండుకుపోయిన కూడుకుంట చెరువు దృశ్యం

సిర్గాపూర్, మే 9, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కడ్పల్ గ్రామ శివారులోని కూడుకుంట చెరువు పూర్తిగా ఎండిపోయింది. వేసవి ఎండలతీవ్రతకు భూగర్భజలాలు అడుగంటడంతో సమీపంలోని బోరుబావులు సైతం వట్టిపోయాయి. చెరువు ఎండుకుపోవడంతో మూగజీవాల, జీవాల దాహార్తి తీర్చలేక రైతులు పడుతున్న పాట్లు చెప్పనలవిగాకుండా ఉన్నాయి. మండలంలోని చెక్‌డ్యాంలు, కుంటలు నీరులేక వెలవెలబోతుండటంతో మూగజీవాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నదాత ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నల్లపోచమ్మ ఆలయానికి సిసి కెమెరాల బహూకరణ

సిసికెమెరాలు బహూకరిస్తున్న నేత్రసెక్యూరిటీ సొల్యూషన్స్ బాధ్యులు

మనూర్, మే 9, ప్రభాతవార్త:

మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువున్న శ్రీనల్లపోచమ్మ ఆలయానికి మండలపరిధిలోని దుదగొండగ్రామానికి చెందిన నేత్ర సెక్యూరిటీ సొల్యూషన్స్ బాధ్యులు సిహెచ్.విష్ణు 3 సిసి కెమెరాలను శనివారం బహూకరించారు. ఆలయంలో దాత విష్ణు, ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిద్దయ్యస్వామి, ఆలయ సిబ్బంది శేఖర్, గ్రామస్థులు మల్లయ్య, శ్రీశైలం, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

పాపన్నపేట, మే 9, ప్రభాతవార్త:

నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరప తలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని పాపన్నపేట మండలపార్టీ అధ్యక్షుడు వడ్ల సంతోష్‌చారి తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిత్రియాల చౌరస్తాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ బిజెపి రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో బస్సులు ఏర్పాట్లు పూర్తిచేసిందని పాపన్నపేటమండలంనుండి మహిళలు, ప్రజలు, యువకులు మోడీ అభిమానులు మోడీసభను విజయవంతం చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానకార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షులు మల్లేశం, కార్యదర్శులు చక్రపాణి, గూడెం మల్లేశం, సంతోష్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు గౌస్, బిజెవైఎం అధ్యక్షులు జగదీష్, కోశాధికారి చంద్రయ్య, బూత్ అధ్యక్షులు మురళి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఆలయ ప్రథమవార్షికోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 9, ప్రభాతవార్త:

సమాజనిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల సేవలు ప్రశంసనీయమని, విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్‌డివిజన్ పరిధిలోని శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమవార్షికోత్సవం శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆలయకమిటీ బాధ్యులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమసంఘం సభ్యులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, మల్లారెడ్డి, దేవేందర్‌యాదవ్, లచ్చిరామ్‌నాయక్, బాబ్జి, శ్రీశైలం పాల్గొన్నారు.

ధాన్యాన్ని రహదారులపై ఆరబెడితే కఠినచర్యలు

-జోగిపేట సిఐ అనిల్‌కుమార్ హెచ్చరిక

రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిఐ అనిల్‌కుమార్

చౌటకూరు, మే 9, ప్రభాతవార్త:

ధాన్యాన్ని రహదారులపై ఆరబెడితే కఠిన చర్యలు తప్పవని జోగిపేట సిఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రమైన చౌటకూరు వద్ద 161వ జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డుపై రైతులు ధాన్యాన్ని కుప్పలుగా పోసి ఆరబెట్టగా శనివారం మోటారుబైక్‌పై అటుగా ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వరి కుప్పలకు ఢీకొని తీవ్రగాయాలకు గురికాగా విషయం తెలుసుకున్న సిఐ అనిల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు పలుసూచనలుచేశారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఫలితంగా క్షతగాత్రులు, మృతిచెందడం లాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని గుర్తుచేశారు. ధాన్యాన్ని వ్యవసాయ భూముల వద్దనే ఆరబెట్టుకోవాలని సూచించారు. రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టినా, నూర్పిడిచేసినా, రాశులుగా, కుప్పలుగాపోసినా చర్యలు తప్పవన్నారు. రోడ్డుపై ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్ డోజర్ సహాయంలో సిఐ అనిల్‌కుమార్ పక్కకు తొలగింపచేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎఎస్ఐ వెంకటేశం, పోలీసుసిబ్బంది, సుందర్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట

-కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న సర్పంచ్ చెన్నయ్య

వర్గల్, మే 9, ప్రభాతవార్త:

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేస్తుందని, అభివృద్ధి పనుల నిర్వహణ కోసం పార్టీలకతీతంగా నిధులను కేటాయించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి అన్నారు. వర్గల్‌మండలం మజీద్‌పల్లిగ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ చెన్నయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నిమ్మ రంగారెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిధులు, ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తుండగా, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతిపేదకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సన్నధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోగా, రైతుభరోసా నిధుల విడుదలతో రైతులు సంతోషంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి అడిగినన్ని నిధులు ఇస్తుండగా, విద్య, వైద్యం, రవాణా, పారిశ్రామికరంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్టీయు ఫార్మసీ కళాశాలలో ముగిసిన ఫెస్ట్

జెఎన్టీయు ఫార్మసీ కళాశాలలో ఫెస్ట్ ముగింపు దృశ్యం

చౌటకూరు, మే 9, ప్రభాతవార్త:

మండలపరిధిలోని సుల్తాన్‌పూర్ జెన్టీయు ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్న మెడోవా 2326 ఫెస్ట్ ఉత్సవాలు శనివారంలో ముగిసాయి. ఫార్మసీ కళాశాల వార్షికోత్సవాల్లోభాగంగా విద్యార్థులు మూడురోజుల పాటు టెకోఫెస్ట్, స్పోర్ట్స్‌డే, వార్షికోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్కాన్ ఫార్మ డైరెక్టర్ బిక్కుమల్ల శ్రీనివాస హాజరై ఫార్మసీవిద్యలో అవకాశాలు, నూతనపోకడలు, ఫార్మ సిస్టులకు ఉన్న ఉద్యోగ అవకాశాలపై వివరించారు. ఫెస్ట్‌ను పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సునీతారెడ్డి, అజిత, సర్పంచులు నందికంటి రామచంద్రారెడ్డి, చంటి గీతారాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న వివొ సావిత్రి

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సిర్గాపూర్ వివొ సావిత్రి

సిర్గాపూర్, మే 9, ప్రభాతవార్త:

పొదుపు సంఘాల రుణాల గ్రౌండింగ్‌లో సిర్గాపూర్ వివొ సావిత్రి రికార్డు సృష్టించి రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. 3.24కోట్ల టార్గెట్‌ను కేటాయించగా సావిత్రి 6.10 కోట్ల రుణాలను ఇప్పించి రాష్ట్రంలోనే సావిత్రి ప్రథమస్థానంలో నిలిచింది. సావిత్రి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం, మంత్రి సీతక్క చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందించింది. లక్ష్యాన్ని ఛేదించిన సావిత్రిని అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

-తహసీల్దార్ ప్రభుదాస్

రైస్‌మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రభుదాస్

పెద్దశంకరంపేట, మే 9, ప్రభాతవార్త:

కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని వెనువెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని పెద్దశంకరంపేట తహసీల్దార్ ప్రభుదాస్ సూచించారు. శనివారం మండల పరిధిలోని శివయ్యపల్లి గ్రామ శివారులోని వెంకటేశ్వర రైస్‌మిల్‌ను తనిఖీచేశారు. రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే దించుకోవడంతోపాటు మళ్లీ వెంటనే లారీలను ధాన్యం కొనుగోలుకేంద్రాలకు పంపించాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలుకేంద్రాల అధికారులు, రైస్‌మిల్లర్ల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీలారదర్ ప్రభుదాస్ పేర్కొన్నారు.

ఘనంగా బొడ్రాయి విగ్రహ ఊరేగింపు

నూతన బొడ్రాయి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

కొండపాక, మే 9, ప్రభాతవార్త:

కుకునూరుపల్లి మండలకేంద్రంలో బొడ్రాయిప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత ఘనంగాజరుగుతున్నాయి. ఆకార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దమ్మ తల్లి అలయం నుండి నూతన బొడ్రాయి విగ్రహాన్ని ట్రాక్టర్‌లోపెట్టి గ్రామంలోని ప్రధాన వీధులగుండా అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు మంగళహారతులు, జలకడువలతో ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జలధివాసం వంటి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లం కనకవ్వఐలయ్య, మాజీ సర్పంచులు కాచం నవీన్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, మాజీ ఎంపిటిసిలు భూరమైన భూమలుగౌడ్, ఇంద్ల కనకయ్య, నరేందర్, ఉప్పల పాండురంగం, గ్రామపెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా హనుమాన్ మందిరం వార్షికోత్సవం

సదాశివపేట, మే 9, ప్రభాతవార్త:

పట్టణంలోని సాగర్‌నగర్ శ్రీకాళికాహనుమాన్ మందిరం 8వ వార్షికోత్సవం శనివారం ఆలయకమిటీ భక్తబృందం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామిపూజారి సారథ్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అలాగే సామూహిక కలశాల ఊరేగింపు నిర్వహించి. అనంతరం బుక్కుని అశోకేసాగర్ పద్మావతి దంపతులు, అవసలి సంగమేశ్వర శ్రావణి దంపతులు హోమం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, మంగళహారతి నిర్వహించి పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాద వితరణచేశారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, మాజీకౌన్సిలర్ ఆకుల శివకుమార్, డి.నర్సింలు, డి.శ్రీనివాస్, ఎల్.బక్కప్పసాగర్, నరసింహులు, అనంత్‌కిషన్, సుధాకర్, రమేష్‌సాగర్, భిక్షపతి, బక్కప్ప, కె.శ్రీనివాస్, సత్యనారాయణ, రాజు, మల్లేశం, శంకర్‌రెడ్డి, బాలు, రాము, ఆలయ భక్తబృందం తదితరులున్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠినచర్యలు

-రైతులకు డిఎస్పి వెంకట్‌రెడ్డి హెచ్చరిక

రోడ్లపై ఆరబెట్టిన వరి కుప్పలను పరిశీలిస్తున్న డిఎస్పి వెంకట్‌రెడ్డి

కల్హేర్, మే 9, ప్రభాతవార్త:

రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఆరబెడితే కఠినచర్యలు తప్పవని డిఎస్పి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జిల్లా ఎస్పి సూచనలమేరకు రోడ్డుపై ఆరబోసిన వరి కుప్పలను డిఎస్పి పరిశీలించి రైతులకు పలు హెచ్చరికలు చేశారు. రోడ్డుపై ధాన్యం ఆరబోసుకుంటే అటుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, రాత్రిళ్లు రోడ్లపైధాన్యం ఉన్నట్లు గుర్తించక రోడ్డుప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గుర్తుచేశారు. రైతులు ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన నిర్దిష్ట కల్లాల్లో, వ్యవసాయశాఖ సూచించిన ప్రదేశాల్లోనే ధాన్యం ఆరబెట్టుకోవాలన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మండల పరిధిలోని బాచేపల్లి, మాసన్నపల్లి గ్రామాల్లో రైతులకు డిఎస్పి వెంకట్‌రెడ్డి అవగాహన కల్పించారు. డిఎస్పి వెంట కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్ ఉన్నారు.

గత పాలకుల ఆటలు సాగవ్

-కాంగ్రెస్ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్

కొండాపూర్, మే 9, ప్రభాతవార్త:

గత పాలకులు ఆటలు సాగవ్ అని కాంగ్రెస్ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని తోగర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం గత పాలకులు గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారని, గ్రామ అభివృద్ధికి అడ్డం వడితే సహించేది లేదన్నారు. తొగర్పల్లి గ్రామంలో కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని, 418 సర్వేనెంబర్‌లో 44 ఎకరాల విస్తీర్ణంలో కంపెనీ నిర్మాణం చేవడుతున్నారన్నారు. 6ఎకరాల్లో వల్లెప్రకృతివనం, 3ఎకరాలలో బీరప్ప దేవాలయం, ఈద్గా, చర్చిలకోసం గతపాలకులు కేటాయించిన గ్రామ పంచాయతీ తీర్మానంకాని, ప్రిసీడింగ్ కాపీలు కాని గతంలో పాలించిన వారు అందించలేదన్నారు. మూడు దేవాలయాలు, పల్లెప్రకృతివనంవెళ్లడానికి దారి ఇవ్వాలని నూతనపరిశ్రమ యజమాన్యానికి వినతిపత్రం అందజేశామన్నారు. పరిశ్రమయాజమాన్యం సానుకూలంగా అంగీకరించారని, వారు దారి ఇవ్వని యెడల కలెక్టర్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి దారిమళ్లించే బాధ్యత తమపాలకవర్గానిదన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినయ్, నాయకులు శంకర్, సామెల్, నందీప్, ఆనందం, రవి తదితరులున్నారు.

నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన

రైతులతో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ డిఈ భాస్కర్‌గౌడ్

గజ్వేల్, మే 9, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతువారం కార్యక్రమాన్ని నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో గజ్వేల్ మండలం జాలిగామ పెద్దచెరువు వద్ద నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులతోపాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ డిఈ భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దచెరువును పరిశీలించడం జరిగిందని, చెరువులు, కుంటలను కబ్జాచేస్తే సహించేందిలేదని అన్నారు. చెరువు, కుంటలను కాపాడే బాధ్యత గ్రామస్థులపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈఈ సుశాంత్, సర్పంచ్ తాళ్ల సునీత ఆంజనేయులుగౌడ్, ఉపసర్పంచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత స్వశక్తితో రాణించాలి

-ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

స్పందన శ్రీనాథ్ దంపతులను సన్మానిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 9, ప్రభాతవార్త:

యువత స్వశక్తితో రాణించాలని ఎఫ్‌డిసి మాజీచైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రజ్ఞాపూర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన స్పందన అండ్ కో చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతులైన యువత స్వశక్తితో రాణించాలని, ఇటువంటి కార్యాలయాలను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అనంతరం స్పందన, శ్రీనాథ్ దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ గంగిశెట్టి చందనరవీందర్, వైస్‌చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయినర్సింగరావు, 5వవార్డు కౌన్సిలర్ మన్నె రూపవెంకటేష్, మున్సిపల్ మాజీచైర్మన్ ఎన్సి.రాజమౌళి, కౌన్సిలర్లు గోలి మమతసంతోష్, అత్తెల్లి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, మర్కంటి భాగ్యలక్ష్మి కనకసేన, కొలిచెలిమె భవానికరుణాకర్, కోట బాబు, బొగ్గుల స్వప్నసురేష్, కప్ప మమత, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్సి.సంతోష్, సిఐ స్పందనశ్రీనాథ్, కుటుంబసభ్యులు చండిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం

-కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సిర్గాపూర్, మే 9, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో వ్యవసాయ సహకారర పరిమితి సంఘం, ఇందిరా క్రాంతి పథకం (ఐకెపి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకుని ఆగం కావొద్దని, ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందన్నారు. గ్రేడ్ ఏ క్వింటాలు వరి ధాన్యానికి 2389 రూపాయలు, సాధారణ రకం వరి ధాన్యానికి 2369 రూపాయలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని నిర్వాహకులకు, అధికారులకు సూచించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రావు పాటిల్, మాజీ సర్పంచ్ యాదవ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, మహేశ్వర్, శంకరయ్యస్వామి, పీరప్ప, కృష్ణ, జైరాజ్, కిషోర్, జమీల్, విఠల్, అశోక్, అధికారులు, సహకారం సంఘం ప్రతినిధులు, ఐకెపి సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.